క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు శివారు రావివారిపాలెంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు శనివారం తెలిపారు. గోదావరి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్లను సీజ్ చేసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు.

శ్రీనివాసుని పవిత్రోత్సవాల ప్రారంభం

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యావచనం, అగ్ని మథనము, అగ్ని ప్రతిష్ఠాపనం, పంచగవ్య ప్రాసన, ఉత్తహోమాలు, నీరాజన మంత్ర పుష్పం సమర్పణ వంటి క్రతవులు జరిగాయి. మధ్యాహ్నం సయ్యి దివాసం, అగ్ని ధ్యానం, చతుర్వేద స్వస్తి, నీరాజన పుష్పం జరిగాయి. ఈ పూజాదికాలను ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ కుటుంబం నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వరరావు, వర ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ, యాగాగ్ని కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాలకు చుట్టుపక్కల గ్రామలైన కడింపాడు, పిట్టల వేమవరం, దొంగరావిపాలెం ప్రజలు హాజరై తిలకించారు.

నేడు సీనియర్స్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్స్ మహిళల, పురుషుల కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం తణుకు జెడ్పీ హైస్కూలు మైదానంలో జరుగుతుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులందరూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన జట్లు ఒంగోలు జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే 71వ సీనియర్ కబడ్డీ స్టేట్ మీట్‌లో పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 96424 98117, 94913 33906 నంబర్లను సంప్రదించాలన్నారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి

నల్లజర్ల: లార్వా దశలోనే దోమలను నివారించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యతపై శనివారం ఆయన మండలంలోని సింగరాజుపాలెం, కొండాయిగుంట గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, డ్రైడే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆయన పర్యవేక్షించారు. దోమలు కుట్టకుండా రాత్రివేళ దోమతెరలను వినియోగించాలన్నారు. నీటి నిల్వ ఉన్న గుంటలపై దోమగుడ్లు పెట్టి లార్వా దశ నుంచి దోమగా మారడానికి 10 రోజుల సమయం పడుతుందన్నారు. ఈలోగా నిల్వ ఉన్న నీటిగుంటలను నిర్మూలించాలన్నారు. ఇది ఖర్చు లేని పని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య పర్యవేక్షకురాలు ఇందిరా ప్రియదర్శిని, ఆశ కార్యకర్తలు రత్నకుమారి, ప్రశాంతి, రమణ, ఎంఎల్‌హెచ్ పి.సాయినాథ్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

కొవ్వూరు: పురపాలక సంఘ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు.కావున ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

నారు .. బేజారు

- పొగాకు నారుకు తగ్గిన డిమాండ్
- కొనే నాథుడే లేని పరిస్థితి
- నారు తయారీదారులకు భారీ నష్టాలు
- ఎకరానికి సరిపడా నారు రేటు కేవలం రూ.1500

దేవరపల్లి: పొగాకు నారుకు ఈ ఏడాది డిమాండ్ లేదు. నారుమడులు కట్టిన రైతులకు లాభాలకు బదులు నష్టాలొచ్చాయి. గతేడాది పొగాకుకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఏర్పడడంతో ఈ ఏడాది కూడా నారుకు మంచి రేటు లభిస్తుందని రైతులు భావించారు. అధిక రేటుకు భూములు కౌలుకు తీసుకుని నారుమడులు కట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో అక్టోబర్ నెలాఖరున పొగాకు నాట్లు ప్రారంభించారు. నెల రోజులుగా ముమ్మరంగా జరుగుతున్న నాట్లు వాతావరణం అనుకూలించడంతో దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. పొగాకు సాగుదారులతో పాటు నారు వ్యాపారులు కూడా ఎక్కువ విస్తీర్ణంలో నారుమడులు కట్టారు. దీంతో నారుకు డిమాండ్ తగ్గింది. నాట్ల ప్రారంభంలో ఎకరా విస్తీర్ణానికి సరిపడిన(6 వేల మొక్కలు) నారు రూ.2500 నుంచి రూ. 3000 రేటు పలికింది. ఈ రేటు కొద్దిరోజులు మాత్రమే ఉంది. తర్వాత రూ.రెండు వేలకు తగ్గింది. ధర తగ్గినా వచ్చిన కాడికే సరిపెట్టుకుందామనుకున్నారు రైతులు. అయితే నారు కొనేందుకు వచ్చిన నాథుడే లేడని నారుమడుల రైతులు వాపోతున్నారు. డిసెంబర్ మొదటి వారంలో, అంటే మరో పది రోజుల్లో నాట్లు పూర్తవుతాయి. అయినప్పటికీ నారుమడుల్లో ఎక్కడ నారు అక్కడే ఉండిపోయిందని నారు వ్యాపారులు తెలిపారు.

రెండు వేల ఎకరాల్లో నారు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాల్లో పొగాకు నారుమడులు కట్టారు. ప్రస్తుతం నారు ధర రూ.1400 నుంచి రూ. రెండు వేలు పలుకుతోంది. 2021 సీజన్‌లో ఎకరం విస్తీర్ణంలో నాటే నారు రూ.18 వేలు పలికింది. అప్పుడు నారుమడులు కట్టిన రైతులు ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ. 20 లక్షలు ఆర్జించారు. గతేడాది ప్రారంభంలో ఎకరం నారు రూ.3,000 నుంచి రూ.3500 పలకడంతో చాలామంది రైతులు పెట్టుబడులతో గట్టెక్కారు. అయితే గతేడాది డిసెంబరు 6, 7 తేదీల్లో సంభవించిన మిచాంగ్ తుపాన్ వల్ల పొగాకు తోటలు దెబ్బతిన్నాయి. రైతులు తోటలను దున్నేసి మరలా తోటలు వేశారు. డిసెంబరు నుంచి మార్చి వరకూ పొగాకు నాట్లు వేయడంతో నారుకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఎకరం నారు రూ.18,000 నుంచి రూ.20,000 పలికింది. దీంతో నారున్న రైతులు రూ.లక్షాధికారులయ్యారు. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టిన రైతులు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఆర్జించారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంటుందనే ఉద్దేశంతో అధిక రేటుకు భూములు కౌలుకు తీసుకుని రైతులు నారుమడులు కట్టారు. అదే సమయంలో గతేడాది నారు కొనలేని పరిస్థితిని ఎదుర్కొన్న పొగాకు సాగుదారులు ఈ ఏడాది జాగ్రత్త పడ్డారు. సాగుదారులే స్వయంగా రెండు, మూడు దశల్లో నారుమడులు కట్టి నారును సిద్ధం చేశారు. దాంతో నారు రైతులు పరిస్థితి తల్లకిందులైంది. ఈ ఏడాది పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. కాగా 90 శాతం నారుమడుల రైతులు కౌలుదారులే.



దేవరపల్లి మండలం పల్లంట్లలో మడుల్లో పెరిగిపోతున్న పొగాకు నారు

ఎకరం భూమి కౌలు రూ.80 వేలు

ఈ ఏడాది ఎకరం భూమి కౌలు రూ.80 వేలు పలికింది. అయినా రైతులు వెనుకాడకుండా ధైర్యంగా కౌలుకు తీసుకుని నారుమడులు కట్టారు. కనీసం పెట్టుబడులు, కౌలు డబ్బులైనా రాకపోతాయా? అనే ఆశతో వారు నారుమడులు కట్టారు. కిలో విత్తనాలు రూ.20 వేలకు కొనుగోలు చేశారు. కౌలు కాక పెట్టుబడి ఎకరానికి సుమారు రూ. 4 లక్షలు అయ్యింది. పెట్టుబడులు రాక నష్టపోయామని చాలామంది రైతులు తెలిపారు. కొంతమంది రైతుల నారుమడుల్లో మొక్క కూడా బోణీ కాలేదు.

నూతన వంగడాలకు డిమాండ్

నూతన వంగడాల పొగాకు నారుకు కొంతవరకూ డిమాండ్ ఉంది. 1353, ఎల్‌వీ–7 వంగడాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో నాటడానికి సరిపడా ఈ రకం నారు రూ.1500 ధర పలుకుతోంది. మొన్నటి వరకూ ఎక్కువగా సాగు చేసిన ఎల్‌వీ–7 వంగడం నారు పట్ల రైతులు మొగ్గు చూపడం లేదు.

పెట్టుబడులు రావడం కష్టం



నారుకు రేటు లేదు.పెట్టుబడులు రావడం కష్టం. నేను 60 సెంట్ల విస్తీర్ణంలో నారుమడులు కట్టాను. కౌలు రూ.40 వేలు, పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. నూతన వంగడాలు 13 53, ఎ–3 వంగడం నారు కట్టడంతో పెట్టుబడులు రావడం కూడా కష్టంగా ఉంది. రెండేళ్లుగా నారు రేటు ఆశాజనకంగా లేదు. పొగాకు సాగు విస్తీర్ణానికి మించి నారుమడులు ఉండడం వల్ల డిమాండ్ తగ్గింది. చాల మంది రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు.

– గెల్లా గోవిందరాజు, సుబ్బరాయపురం, కౌలు రైతు, దేవరపల్లి

ఎకరానికి రూ.2 లక్షల నష్టం



నారుమడులు కట్టిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షల నష్టం వస్తోంది. రెండేళ్లుగా నారుమడులు కట్టి నష్టపోతున్నాం. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టాను. కౌలు రూ. 80 వేలు, పెట్టుబడి రూ. 2.30 లక్షలు అయ్యింది. నారు అడిగే నాథుడు కనిపించడం లేదు. వినుకొండ నుంచి రైతులు వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాదికి నారు సీజన్ ముగిసింది. డిసెంబరు 15వ తేదీ నాటికి కౌలు కాలపరిమితి ముగుస్తోంది. మడులను దున్ని పొలం రైతుకు అప్పగించాలి.

– సీహెచ్ వెంకటేశు, కౌలు రైతు, రామన్నపాలెం, దేవరపల్లి మండలం

అధిక వర్షాలకు తోటలు దెబ్బతిన్నాయి



గత నెలలో కురిసిన అధిక వర్షాలకు తోటలు నీట మునిగి చనిపోయాయి. దెబ్బతిన్న తోటలు దున్ని వేసి మరలా తోటలు వేస్తున్నాం. మా ప్రాంతంలో నారు కొరత ఎక్కువగా ఉంది. అక్కడ నుంచి రైతులు ఇక్కడకు వచ్చి నారు కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నాం. రోజు ఈ ప్రాంతం నుంచి 3 లక్షల మొక్కలు (60 ఎకరాలకు) తీసుకు వెళుతున్నాం. నారు ధర కంటే రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. నారు ధర రూ.1500 ఉంది.

– డి. కృష్ణయ్య, రైతు, వినుకొండ, పల్నాడు జిల్లా

అర్హులందరూ ఓటు నమోదు చేయించుకోవాలి



నిడదవోలు మండల సమాఖ్య కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం మహాలక్ష్మి



దేవరపల్లి 63వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి రవికిషోర్

- ఉండ్రాజవరం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్
- నేడు కూడా నమోదు శిబిరాల కొనసాగింపు

ఉండ్రాజవరం: గ్రామాల్లోని ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాల్లో అర్హులందరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. మండలంలోని కాల్దారి, దమ్మెన్ను, వేలివెన్ను గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు ఓటు నమోదు చేస్తారన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తమ జనన ధ్రువీకరణ పత్రం సమర్పించి, ఓటు నమోదు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: వజ్రాయుధమైన ఓటు హక్కు ప్రాముఖ్యతను యువత తెలుసు కోవాలని వెలుగు ఏపీఎం ఇ.మహాలక్ష్మి సూచించారు. నిడదవోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఓటు హక్కు నమోదుపై శనివారం డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు గోపి, వీఓఏలు పాల్గొన్నారు.

దేవరపల్లి: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు మండలంలో ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని 67 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమం శనివారం ముమ్మరంగా జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, ఓటరు కార్డుకు ఆధార్ నంబరు అనుసంధానం చేస్తున్నారు.

నిండైన ప్రేమతో సేవ చేస్తే దైవత్వం



అనంతపల్లిలో సత్యసాయి జయంతి వేడుకల్లో భజన చేస్తున్న భక్తులు

నల్లజర్ల: హృదయంలో నిండైన ప్రేమతో ఇతరులకు సేవ చేస్తే దైవత్వం సిద్ధిస్తుంది. ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే నిన్ను కాపాడుతుంది. అంటూ సత్యసాయి చెప్పిన సూక్తిని అనుసరించి ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సత్యసాయి సేవాసమితి నల్లజర్ల మండల మాజీ కన్వీనర్ మంచిరాజు రాజగోపాల భుజంగరావు అన్నారు. సత్యసాయి 98వ జయంతి సందర్భంగా శనివారం అనంతపల్లిలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ ప్రతి అడుగు సమాజ హితం కోసం వేయాలన్నారు. ఆయన ఆధ్వర్యంలో నగర సంకీర్తన, అభిషేకాలు, భజనలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రమాదంలో అసిస్టెంట్ ఎంవీఐకి స్వల్ప గాయాలు



కొవ్వూరులో రోడ్డు ప్రమాదానికి గురైన కారు, ఢీకొట్టిన లారీ

కొవ్వూరు: పట్టణంలోని క్రిస్టియన్ శ్మశానవాటిక ఎదురుగా శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరులో అసిస్టెంట్ ఎంవీఐగా పని చేస్తున్న నేతల నెహ్రూ స్వల్పంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్న ఆయన కారులో ఏలూరు బయల్దేరి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో కారు ముందు ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్ తునాతునకలైంది. కారులో ఉన్న ఏ ఎంవీఐ నెహ్రూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు పూర్తి దెబ్బతింది. నెహ్రూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

మహిళల జీవనోపాధికి మెప్మా దోహదం



మెప్మా మార్కెట్ స్టాల్స్

నిడదవోలు: పట్టణాల్లో ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌లు స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి ఎంతగానో దోహదపడతాయని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎ.జ్యోతి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సంత మార్కెట్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు కుటుంబ పోషణకు యూనిట్లు పెట్టుకుని నడుపుకుంటే వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మెప్మా మార్కెట్‌లో వివిధ రకాల వస్తువులను వినియోగదారులకు తక్కువ ధరకు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం క్రయవిక్రయాలు నేరం

- పౌరసరఫరాల శాఖ జిల్లా సహాయాధికారి నాగాంజనేయులు
- ముక్కామల, ఖండవల్లి గ్రామాల వాసులకు అవగాహన



రేషన్ బియ్యంపై ముక్కామల వాసులకు అవగాహన కల్పిస్తున్న నాగాంజనేయులు

పెరవలి: ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం ఎంతో బలవర్థకమైందని, వాటిలో కెర్నల్స్ కలపడం వలన ఎన్నో పోషక విలువలు ఉంటాయని పౌరసరఫరాల శాఖ జిల్లా సహాయాధికారి నాగాంజనేయులు అన్నారు. మండలంలోని ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి రేషన్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ రేషన్ బియ్యాన్ని కిలో రూ.43.50 రేటుకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేస్తుంటే, వాటిని విక్రయించడం భావ్యం కాదన్నారు. సవరించిన నిబంధనల ప్రకారం రేషన్ బియ్యాన్ని అమ్మినా, కొనుగోలుచేసినా నేరమే అని నాగాంజనేయులు స్పష్టం చేశారు. ఇకపై అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇకపై ప్రతి రేషన్ కార్డుదారుడికీ కందిపప్పు, పంచదార అందించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఏ కార్డుదారుడికైనా ఈ సరకులు అందకపోతే మండల సివిల్ సప్లయి అధికారికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. రేషన్ బియ్యాన్ని దళారీలకు, మధ్యవర్తులకు అమ్మడం నిత్యావసర వస్తువుల చట్ట ప్రకారం నేరమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఏపీఎం బి.రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో యుద్ధాల నివారణ

మూడో ప్రపంచ యుద్ధంపై చర్చా వేదికలో వక్తలు



చర్చా వేదికలో మాట్లాడుతున్న ఉండ్రాజవరం హైస్కూల్ హెచ్‌ఎం మాణిక్యాలరావు

ఉండ్రాజవరం: దేశాలు కూడా ఆధ్యాత్మిక చింతన పాటిస్తే యుద్ధాలను నివారించవచ్చని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.మాణిక్యాలరావు అన్నారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు ఆధ్వర్యంలో మూడో ప్రపంచ యుద్ధంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి విశ్రాంత అధ్యాపకుడు కోట రామప్రసాద్ అధ్యక్షత వహించారు. రామప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం ఇప్పటికే రెండు ప్రపంచ యుద్ధాలను చూసిందన్నారు. మూడో ప్రపంచ యుద్ధం కూడా వస్తే మానవాళి వినాశనం తప్పదన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి అయిన పర్తి రాజగోపాల్ మాట్లాడుతూ భారతదేశం ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందన్నారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు మాట్లాడుతూ ప్రపంచ యుద్ధాలు మానవాళి వినాశనానికి దారి తీస్తాయన్నారు. సుంకవల్లి ఇంగ్లిషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్. దేవి మాట్లాడుతూ ప్రజలు యుద్ధ భయంతో జీవించరాదన్నారు. మహతి ఇంగ్లిషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఐ.జగదీష్ మాట్లాడుతూ రష్యా, ఉక్రెయిన్ దేశాల సరసన అగ్రరాజ్యాలు యుద్ధానికి కాలు దువ్వుతున్నాయన్నారు. కార్యక్రమంలో సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, గుత్తికొండ ప్రవంతి, విశ్రాంత ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావు, సింహాద్రి రామచంద్రరావు, కేవీ కృష్ణారావు, పి.ప్రకాశరావు, పాఠకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: నియోజకవర్గంలోని 19 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.11,26,315 మంజూరైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వాటిలో కొవ్వూరు పట్టణానికి చెందిన మట్టం వీరబాబుకు రూ.45 వేలు, మైలపల్లి రత్నానికి రూ.80 వేలు విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాస్, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖల నూతన కార్యవర్గాలు



యూటీఎఫ్ పెరవలి మండల సమావేశంలో నినాదాలు చేస్తున్న టీచర్లు



తాళ్లపూడి యూటీఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పెరవలి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధమైందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి విపర్తి వెంకటనారాయణ అన్నారు. యూటీఎఫ్ మండల శాఖ మహాసభ శనివారం పెరవలి నంబర్–2 పాఠశాలలో జరిగింది.ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా వి.సూర్యభాస్కరరెడ్డి, గౌరవా ధ్యక్షుడిగా వీఎస్‌వీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డీవీఎస్ఆర్ తారా కృష్ణ, కోశాధికారిగా ఈ.గణపతి, కార్యవర్గ సభ్యులుగా 8 మందిని ఎన్నుకున్నారు. మండలం నుంచి జిల్లా కౌన్సిలర్లుగా మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

తాళ్లపూడి మండల శాఖ..

తాళ్లపూడి(కొవ్వూరు): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) తాళ్లపూడి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఆ సంస్థ గౌరవాధ్యక్షురాలు ఎం.రాజకుమారి తెలిపారు. అధ్యక్షుడిగా బారసాల శంకరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా జె.లక్ష్మీపతి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా కె.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా టి.క్రాంతికుమార్, కోశాధికారిగా టి.వెంకటరమణ, కార్యదర్శులుగా కె.ప్రసన్నకుమార్, కె.సుమన్ కాంతకుమారి, కె.గణేష్, కె.అబ్బులు, కె.శ్రీనివాస్, కె.లక్ష్మయ్య, సీహెచ్ అనితా పూర్ణిమలతో పాటు ఆడిట్ సభ్యుడిగా కె.రాంపండు, కుటుంబ సంక్షేమ పథకం కార్యదర్శిగా డి.రామం, పత్రికా కార్యదర్శిగా కె.శ్రీనులను ఎన్నుకున్నట్టు శనివారం వెల్లడించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా తాళ్లపూడిలో నిర్వహించిన సమావేశంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాజకుమారి తెలిపారు.

బొండాం కొట్టే పనిలేదు..!

కొబ్బరి బొండాల నుంచి నీరు తేలిగ్గా తీయడానికి ప్రత్యేక పరికరం



బొండాల నుంచి నీరు తేలిగ్గా తీయడానికి వినియోగిస్తున్న ప్రత్యేక పరికరం

నల్లజర్ల: కొబ్బరి బొండాం నీళ్లు తాగాలంటే కత్తెతో కొట్టాలి. కాని ఇప్పడంత శ్రమ అవసరం లేదు. అందుకు చిన్నపాటి సాంకేతిక పరికరం అందుబాటులోకి వచ్చింది. దీనిని ఉపయోగించి చుక్క నీరు కూడా బయట పడకుండా తీయవచ్చు. నల్లజర్లలో రాపాక మోషే పదో తరగతి వరకు చదువుకున్నాడు. కొంతకాలం గల్ఫ్ దేశాలలో టైలరింగ్ చేశారు. ఏజెంట్లు మోసాల వల్ల తక్కువ సొమ్ము చేతికందేది. దీంతో అక్కడ నుంచి వచ్చి ఆ సొమ్ముతో నల్లజర్లలో పండ్ల రసాల షాపు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు కొబ్బరి బొండాలు కూడా అమ్ముతున్నాడు. అయితే మార్కెట్లోకి కొత్తగా వచ్చి యంత్ర పరికరంలో బొండం అందులో పెట్టి రెండుగా చీల్చి తేలిగ్గా నీటిని బయటకు తీస్తున్నారు. వాటిని సీసాలో గాని గ్లాసులో గాని వేసి ఇస్తున్నాడు. సీతాకాలం అయినా డాక్టర్ల సలహా మేరకు చాలామంది కొబ్బరి నీళ్లు స్వీకరిస్తున్నారు.